సాక్షి
పార్వతీపురం మన్యం

గురువారం | 10 | జూలై | 2025



15 నుంచి పారిశుధ్య పక్షోత్సవాలు

ఈ నెల 15 నుంచి ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహిస్తామని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు.

- 4లో



మత్స్యకారుల హాహాకారాలు

మడ్డువలస ప్రాజెక్టులో చేపలవేటకు వెళ్లిన ఇద్దరు మత్స్యకారులు గుర్రపుడెక్క మధ్యలో బుధవారం చిక్కుకుని హాహాకారాలు చేశారు.

- 4లో



అగ్నిప్రమాదంపై ఫైర్ ఆడిట్

అడ్డూరువానిపాలెం కేజీబీవీలో మంగళవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంపై ఫైర్ ఆడిట్ నివేదికను అందజేయాలని కలెక్టర్ అంబేడ్కర్ ఆదేశించారు.

- 4లో

కదంతొక్కిన కార్మిక లోకం

- నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్
- విధులు బహిష్కరించి సమ్మెలో పాల్గొన్న కార్మికులు, ఉద్యోగులు
- ప్రజావ్యతిరేక విధానాలపై నిరసన హోరు



పార్వతీపురంలోని సుందరయ్య భవనం నుంచి ర్యాలీగా వెళ్తున్న ప్రజాసంఘాల నాయకులు

పార్వతీపురం:

ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా కార్మిక, కర్షక, ఉద్యోగ వర్గాలు కదంతొక్కాయి. నిరసన గళం వినిపించాయి. లేబర్ కోడ్‌లు రద్దు చేయాలంటూ నినదించాయి. భారీ ర్యాలీలు, మానవ హారాలు నిర్వహించాయి. విధులు బహిష్కరించి దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో బుధవారం భాగస్వాములయ్యాయి. సమ్మెను విజయవంతం చేయడంలో వివిధ రంగాలకు సంబంధించిన కార్మికులు, బ్యాంకు ఉద్యోగులు స్వచ్ఛందంగా పాల్గొన్నారు. పార్వతీపురం పట్టణంలోని సందరయ్య భవనం నుంచి మెయిన్ రోడ్ మీదుగా పాత బస్‌స్టాండ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కార్మిక, ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ దేశంలో పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను అమలుకు ప్రయత్నించడం దుర్మార్గమన్నారు. జాతీయ ప్రయోజనాలను కాలరాస్తూ విద్యుత్, రవాణా, బ్యాంకు, ఇన్సూరెన్సు, ఉక్కు తదితర ప్రభుత్వ సంస్థలను ప్రైవేటీకరిస్తోందన్నారు. ప్రభుత్వం తీసుకొచ్చే నాలుగు లేబర్ కోడ్‌లు అమలైతే పని ప్రదేశంలో కార్మికులకు రక్షణ ఉండదని, ఆరోగ్య భద్రత, పని గంటలు, వారాంతపు సెలవులు, సాధారణ సెలవులు తదితర హక్కులను కోల్పోతారన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు రాష్ట్రంలోని చంద్రబాబు ప్రభుత్వం మద్దతుపలకడం విచారకరమన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు జి.వెంకటరమణ, ఏపీ రైతు సంఘం నాయకుడు ఎం.కృష్ణమూర్తి, ఎం.గోపాలం, యూసీసీ ఆర్ఐ ఎంఎల్ నాయుకుడు బి.నర్సింగరావు, ఏఐసీసీటీయూ నాయకుడు పి.భాస్కరరావు, సీఐటీయూ నాయకుడు ఆర్.వేణు, రైతు కూలీ సంఘ నాయకుడు ఎం.భాస్కరరావు, మున్సిపల్ వర్కర్స్ ఫెడరేషన్ యూనియన్ నాయకుడు సీహెచ్.సింహాచలం, గిరిజన సంఘ నాయకుడు పి.రంజిత్‌కుమార్, ఐద్వా నాయకురాలు ఆర్.శ్రీదేవీ, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు ఎం.ఉమామహేశ్వరి, ఆశ, సీహెచ్‌డబ్ల్యూ వర్కర్లు, ఫీల్డ్ అసిస్టెంట్ నాయకులు, మధ్యాహ్నభోజన నిర్వాహకులు, శ్రామిక రైతు సంఘ నాయుకులు, రైస్ మిల్లు సంఘనాయకులు పాల్గొన్నారు.



మార్కెట్ యార్డ్ వద్ద నిరసన తెలుపుతున్న ఏఐటీయూసీ నాయకులు

ప్రజావ్యతిరేక విధానాలను ప్రతిఘటిద్దాం

నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేసేవరకు ప్రభుత్వాన్ని ప్రతిఘటిద్దామని ఏఐటీయూసీ పార్వతీపురం మన్యం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌వీఎస్ కుమార్ పిలుపునిచ్చారు. సమ్మెలో భాగంగా జిల్లా ఆస్పత్రి, మార్కెట్ యార్డ్‌వద్ద నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. దేశంలో కనీస వేతనాలు అమలు కాక, ఉద్యోగ భద్రత లేక కార్మికులు, ఉద్యోగులు ఇబ్బందులకు గురవుతున్నారని, ఈ సమస్యలను తెలుపుకునేందుకు అవకాశం లేకుండా కొత్త చట్టాలను అమలు చేయడం విచారకరమన్నారు. పెట్టుబడిదారులకు లబ్ధిచేకూరేలా, కార్మికుల శ్రమను దోచేలా ఉన్న చట్టాలను వెనుకకుతీసుకోవాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సింహాద్రి, ఇ.వి.నాయుడు, ఆర్.దుర్గాప్రసాద్, కుమారమ్మ, శంకరరావు, హమాలీలు, శానిటైజేషన్ సూపర్‌వైజర్లు, సెక్యూరిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



జిల్లా ఆస్పత్రివద్ద నిరసన తెలుపుతున్న ఏఐటీయూసీ నాయకులు

న్యూస్‌రీల్

ఈపీడీసీఎల్ ఎస్ఈ బాధ్యతల స్వీకరణ



మల్లికార్జునరావు

సాక్షి, పార్వతీపురం మన్యం: ఏపీ ఈపీడీసీఎల్ పార్వతీపురం మన్యం సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజినీర్‌గా కె.మల్లికార్జునరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. 1993లో సంస్థలో విధుల్లో చేరిన ఆయన.. గతంలో పాడేరు ఆపరేషన్ ఈఈ గానూ, శ్రీకాకుళం జిల్లాలో ఈఈ/డీపీఈ గానూ పని చేశారు. ప్రస్తుతం ఉద్యోగోన్నతిపై సర్కిల్ రెండో ఎస్ఈగా ఇక్కడ బాధ్యతలు చేపట్టారు. మన్యం సర్కిల్ తొలి ఎస్ఈగా వచ్చిన చలపతిరావు ఇటీవలే ఉద్యోగ విరమణ చేశారు. సిబ్బంది సహకారంతో జిల్లాలో మెరుగైన విద్యుత్తు సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటానని మల్లికార్జునరావు తెలిపారు.

సురక్షిత ప్రసవమే లక్ష్యం

- జిల్లా ఎన్సీడీ ప్రోగ్రాం అధికారి జగన్‌మోహన్‌రావు



కొమరాడ పీహెచ్‌సీలో గర్భిణులతో మాట్లాడుతున్న జిల్లా ఎన్సీడీ ప్రొగాం అధికారి జగన్‌మోహన్‌రావు

కొమరాడ: సురక్షిత ప్రసవమే లక్ష్యంగా గర్భిణులకు వైద్యసేవలు అందించాలని జిల్లా ఎన్సిడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు వైద్యులకు సూచించారు. కె.ఆర్.బి.పురం, కొమరాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో బుధవారం నిర్వహించిన ప్రధాన మంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పీహెచ్‌సీల్లో అందుతున్న వైద్యసేవలను గర్భిణులను అడిగి తెలుసుకున్నారు. గిరిశిఖర గ్రామాలకు చెందిన గర్భిణులను ప్రసవ సమయానికి ముందుగానే వైటీసీలో చేర్చాలని వైద్యసిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో వైద్యులు అరుణ్‌కుమార్, గణేష్ పట్నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

11న ఏపీ ఎన్‌జీఓ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల రాక

విజయనగరం అర్బన్: ఏపీ ఎన్‌జీఓ రాష్ట్ర అధ్యక్షుడిగా, జేఏసీ చైర్మన్‌గా ఎన్నికైన విద్యాసాగర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జేఏసీ డిప్యూటీ సెక్రటరీ జనరల్‌గా ఎన్నికైన డీవీరమణ ఈ నెల 11న తొలిసారి జిల్లాకు రానున్నారని ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టి.శ్రీధర్‌బాబు, సురేష్, సహ అధ్యక్షులు జీవీఆర్ఎస్ కిశోర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వారికి వై జంక్షన్‌లో ఘన స్వాగతం పలుకుతామన్నారు. అక్కడి నుంచి జెడ్పీ కార్యాలయం వరకు బైక్ ర్యాలీతో స్వాగతిస్తామని చెప్పారు. మధ్యాహ్నం జెడ్పీ సమావేశ మందిరంలో జిల్లా, తాలూకా యూనిట్ కార్యవర్గం, జేఏసీ మిత్ర సంఘాల కార్యవర్గంతో సమావేశం నిర్వహించి అనంతరం ఘనంగా సత్కరిస్తామని తెలిపారు. కార్యక్రమానికి జిల్లాలోని ఉద్యోగ, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, యూనిట్ కార్యవర్గ సభ్యులు హాజరుకావాలని కోరారు.

రేగాలమ్మా.. కాపాడమ్మా..

గరుగుబిల్లి మండలం నాగూరు గ్రామంలో రేగాలమ్మ తల్లి వారాల పండగను బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఏటా వరి ఉభాలు ప్రారంభించే ముందు మంగళ, బుధవారాల్లో అమ్మవారికి మొక్కులు చెల్లించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా సర్పంచ్ కేతిరెడ్డి శిరీష, గ్రామపెద్దలతో కలిసి గ్రామస్తులు ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మొక్కుబడులు చెల్లించారు.

- గరుగుబిల్లి



నాగూరులో అమ్మవారికి మొక్కులు చెల్లిస్తున్న భక్తులు



పల్లపరిశి నాయుడు వేసిన రేగాలమ్మ వర్ణచిత్రం

చంద్రబాబు మోసాలపై రాజన్న చైతన్యం



రామాకాలనీ వాసులకు గత, ప్రస్తుత ప్రభుత్వం పాలన మధ్య తేడాను వివరిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

సాలూరు రూరల్: ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలుచేయకుండా చంద్రబాబు ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మోసాన్ని మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు పీడిక రాజన్నదొర సాలూరు పట్టణం 23వ వార్డు రామాకాలనీ ప్రజలకు బుధవారం వివరించారు. కాలనీలో ఇంటింటికీ వెళ్లి సీఎం చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీలు అమలుచేయకపోవడం వల్ల ఏడాదిలో ఒక్కో కుటుంబం ఎంత నష్టపోయారన్నది తెలియజేశారు. దీనిపై కూటమి నేతలను నిలదీయాలని సూచించారు. గత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ శతశాతం అమలుచేసిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ అంటూ ప్రజలకు మోసం ఫిక్స్ చేసిన తీరును వివరించారు. గత ప్రభుత్వం కంటే రెట్టింపు పథకాలు ఇస్తామంటే నమ్మిఓట్లు వేసి మోసపోయామని, ఉచిత బస్సు, గ్యాస్‌సిలిండర్లు, నిరుద్యోగ భృతి, రైతుభరోసా ఇలా.. ఏ పథకమూ అందడంలేదంటూ పలువురు మహిళలు రాజన్నదొర వద్ద వాపోయారు. దీనిపై రాజన్నదొర స్పందిస్తూ అబద్ధాలు చెప్పడంలో చంద్రబాబు దిట్ట అని, ఆయన మాటల గారడీతో ఎవరినైనా మోసంచేస్తారంటూ విమర్శించారు. సంపద సృష్టిస్తానని చెప్పి విద్యుత్ చార్జీలు, ఇంటిపన్నుల భారం వేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ, వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, కౌన్సిలర్లు గొర్లె జగన్‌మోహన్, గిరి రఘు, మాజీ కౌన్సిలర్ పిరిడి రామకృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు తాడ్డి రమణ, కర్రి మహేష్, జాగారపు రమేష్, రామాకాలనీ నాయకులు పాల్గొన్నారు.

వ్యవసాయశాఖ మంత్రి ఉన్నా ప్రయోజనం శూన్యమే..



జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

రాజాం:

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రిగా కింజరాపు అచ్చెన్నాయుడు కొనసాగుతున్నా ఉత్తరాంధ్ర రైతులకు విత్తన, ఎరువు, సాగు నీటి కష్టాలు తప్పడంలేదని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఆరోపించారు. రాజాంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు విత్తనాలు, ఎరువులను ప్రభుత్వం సరఫరా చేయకుండా బ్లాక్ మార్కెట్‌లో విక్రయిస్తోందని విమర్శించారు. వ్యవసాయ శాఖ మంత్రి మాత్రం రైతులు సుభిక్షంగా ఉన్నారని అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

గిట్టుబాటు ధర లేక మామిడిపండ్లను రైతులు రోడ్లమీద పడేస్తే ఏపీ ప్రభుత్వం పట్టించుకోలేదని, పక్కనే ఉన్న కర్ణాటక ప్రభుత్వం మాత్రం రాయితీ ఇచ్చి రైతులకు అండగా నిలిచిందని పేర్కొన్నారు. జిల్లాలో చెరకు ఫ్యాక్టరీ ఎత్తివేసే పరిస్థితి వస్తే డీఆర్‌సీ సమావేశంలో నిలదీయడంతో ఆ పరిస్థితి నుంచి తప్పుకుని పత్రికా ప్రకటన చేశారని, కనీసం రైతులును పట్టించుకోని మంత్రి వ్యవసాయశాఖ మంత్రిగా ఉండడం మన దురదృష్టకరమని విమర్శించారు. రెండేళ్లుగా రైతు భరోసా వేయలేని మంత్రి ఏమని ప్రెస్‌మీట్‌లు పెడుతున్నారో అర్థంకావడంలేదన్నారు.

ప్రాణం తీసిన స్నేహితుడి మోసం

- మంత్రి అనుచరుడైన వడ్డీవ్యాపారి వేధింపులు తాళలేక ఆత్మహత్యకు పాల్పడిన చిరువ్యాపారి
- తన ఆవేదనను ముందుగా రికార్డుచేసి మిత్రులకు పంపించిన మృతుడు
- కుటుంబాన్ని మంత్రి సంధ్యారాణి ఆదుకోవాలంటూ వేడుకోలు
- కన్నీటిపర్యంతమైన కుటుంబ సభ్యులు



ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఇందూరి నాగభూషణరావు

సాలూరు:

స్నేహం ముసుగులో మోసానికి సాలూరు పట్టణానికి చెందిన ఓ చిరువ్యాపారి బలయ్యాడు. ఆర్థిక వేధింపులకు తట్టుకోలేక బుధవారం ఉదయం 4.30 సమయంలో తన ఎలక్ట్రిక్ షాపులోనే ఫ్యాన్‌కు ఉరివేసుకుని ప్రాణాలు తీసుకున్నాడు. స్నేహితుడే తనను నట్టేట ముంచేశాడంటూ ఆత్మహత్యకు ముందు రికార్డు చేసిన ఆడియోను మిత్రులకు పంపించాడు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు, కుటుంబ సభ్యులు, మృతిడి ఆడియో రికార్డులో తెలిపిన వివరాల ప్రకారం.. పాచిపెంట మండలం గురివినాయుడుపేట గ్రామానికి చెందిన నాగభూషణరావు(63) సుమారు 32 సంవత్సరాల కిందట సాలూరు పట్టణానికి వలస వచ్చాడు. ఇక్కడి తెలగావీధిలో కుటుంబంతో నివసిస్తూ మామిడిపల్లి కూడలిలో ఎక్ట్రిక్ షాపు నిర్వహిస్తున్నాడు. వ్యాపార అవసరాల్లో భాగంగా పట్టణంలోని డబ్బివీధికి చెందిన వడ్డీ వ్యాపారి డబ్బి కృష్ణారావు వద్ద రూ.40 లక్షలు అప్పుచేశాడు. ఆ డబ్బు ఎప్పటికీ తిరిగి ఇవ్వడం లేదని రూ.కోటి విలువైన షాపును రూ.75 లక్షలకే కృష్ణారావు రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. నాగభూషణరావు తీసుకున్న రూ.40 లక్షలు అప్పు మినహాయిస్తే మిగిలిన రూ.35 లక్షలు ఇవ్వలేదు. రూ.10 లక్షలు అప్పుగా తిరిగిచ్చాడు. నాగభూషణరావు నుంచి బలవంతంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న షాపును తిరిగి ఆయనకే నెలకు రూ.20వేలు అద్దె ప్రాతిపదికన తనఖా ఇచ్చాడు. పది లక్షలకు వడ్డీ రూ.పదివేలు చొప్పున నెలకు ప్రతినెలా రూ.30 వేలు వడ్డీ వ్యాపారి వసూలు చేస్తున్నాడు. తన డబ్బునే ఉంచుకుని, తనకు అప్పుకింద ఇచ్చి వడ్డీ వసూలు చేస్తూ కృష్ణారావు తనను ఆర్థిక కష్టాల్లోకి నెట్టేశాడని, ఎదిరించే ధైర్యంలేక, మోసాన్ని భరించలేక ఆత్మహత్యకు పాల్పడినట్టు ఆడియోలో పేర్కొన్నారు. మృతునికి భార్య పద్మావతి, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నా రు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు సాలూరు టౌన్ ఎస్ఐ అనిల్ కుమార్ కేసు నమోదు చేశా రు. ఆత్మహత్యకు పాల్పడిన నాగభూషణరావు జేబులో రాతపూర్వక లేఖ కూడా ఉన్నట్టు తెలుస్తోంది. పోలీసులు ఆలేఖను స్వాధీనం చేసుకున్నారు.



విలపిస్తున్న మృతుడి భార్య, కుటుంబీకులు

కుటుంబాన్ని ఆదుకోవాలని మంత్రికి విజ్ఞప్తి

చనిపోయేముందుకు తన బాధను మంత్రి సంధ్యారాణికి తెలిసేలా ఆడియోరూపంలో రికార్డు చేసి మిత్రలకు పంపించాడు. తనకు జరిగిన మోసం, అన్యాయాలను మంత్రికి తెలపాలనుకున్నా బిజీగా ఉంటారని, స్నేహితుడిపై ఏం చెప్తానని వెనుకకు తగ్గాను. నా కష్టాలు చూసి వాడి మనసు మారుతుందని ఆశించాను. స్నేహితుడైన కృష్ణారావు చేసిన అన్యాయాన్ని, మోసాన్ని భరించలేకనే ఆత్మహత్యకు పాల్పడుతున్నానంటూ నాగభూషణరావు ఆడియోలో పేర్కొన్నారు. తనకు కృష్ణారావు ఇవ్వాల్సిన రూ.15 లక్షలు, తను నెలానెలా చెల్లించిన రూ.12 లక్షలు మొత్తం రూ.27 లక్షలు తన కుటుంబానికి ఇప్పించాలని మంత్రికి విజ్ఞప్తిచేశాడు. టీడీపీ మాజీ కౌన్సిలర్ కృష్ణారావు కొంత కాలంలో వడ్డీవ్యాపారం చేస్తున్నాడు. మంత్రి సంధ్యారాణికి సన్నిహితుడు. వ్యాపారి మృతితో వడ్డీవ్యాపారుల ఆరాచకాలపై పట్టణంలో చర్చ జోరందుకుంది.

రాజీయత్నాలు

చిరువ్యాపారి మృతిచెందుతూ ఆడియో రూపంలో తెలిపిన ఆవేదన పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. మాజీ కౌన్సిలర్ తీరుపై విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో టీడీపీ నాయకులు నిందితుడిని కాపాడేందుకు రంగంలో దిగారు. మృతుడు నాగభూషణరావు కుటుంబ సభ్యులతో మంతనాలు జరిపారు. కొంత మొత్తానికి రాజీ కుదిర్చినట్టు సమాచారం. ఈ సంఘటనపై మృతుడు భార్య పద్మావతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్ఐ అనిల్‌కుమార్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.



ఎత్తైన కొండ ఎక్కుతూ కరడవలస పాఠశాలకు అతికష్టం మీద వెళ్తున్న ఎగువ కాషాయివలస చిన్నారులు



ఉపాధ్యాయులు సమయానికి రాకున్నా శ్రద్ధగా ప్రార్థన చేస్తున్న కరడవలస ప్రాథమిక పాఠశాల చిన్నారులు

చదువు కోసం కొండెక్కాల్సిందే..

సాలూరు మండలంలో చాలా గ్రామాల గిరిజన విద్యార్థులు చదువుకోసం కొండలు ఎక్కుతున్నారు. ఒకరికిఒకరు తోడుగా చదువుకోసం ముందుకు సాగుతున్నారు. క్రమశిక్షణతో చదువులు సాగిస్తున్నారు. ఉపాధ్యాయులు సమయానికి రాకున్నా ప్రార్థన చేస్తూ బుద్ధిగా కూర్చుంటున్నారు. దీనికి కురుకూటి పంచాయతీ ఎగువ కాషాయివలస, కరడవలస గ్రామాల చిన్నారులే నిలువెత్తు సాక్ష్యం. ఎగువకాషాయివలస గ్రామానికి చెందిన 9 మంది చిన్నారులు ప్రతిరోజూ రాళ్లదారిలో కిలోమీటరు దూరంలో ఉన్న కరడవలస ప్రాథమిక పాఠశాలకు చదువుకోసం రాకపోకలు సాగిస్తున్నారు. సరైన దారిలేకపోవడంతో నిత్యం కష్టాలు పడుతున్నారు. ఇటీవల ఇదే గ్రామానికి చెందిన ఆశ కార్యకర్త అనారోగ్యానికి గురికావడంతో కుటుంబ సభ్యులు డోలీలో ఆస్పత్రి తరలించిన విషయం తెలిసిందే. గిరిజన సంక్షేమ శాఖమంత్రి సంధ్యారాణి స్పందించి చిన్నారులు పాఠశాలకు చేరుకునేందుకు అనువుగా రోడ్డు సదుపాయం కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

- సాలూరు రూరల్

క్లుప్తంగా

బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి

• మరొకరికి గాయాలు


నాగేష్ (ఫైల్)

భామిని: మండలంలోని డోకుల గూడకు చెందిన గిరిజనుడు కొండగొర్రి నాగేష్(49)బుధవారం బైక్ అదుపుతప్పడంతో జరిగిన ప్రమాదంలో మృతి చెందాడు. భామిని నుంచి డోకులగూడ వైపు వెళ్తుండగా ఏబీ రోడ్డుపై ద్విచక్ర వాహనం అదుపుతప్పి రోడ్డుపై పడిపోగా సంఘటనా స్థలంలోనే మృత్యువాత పడ్డాడని బత్తిలి పోలీసులు తెలిపారు. గుమ్మలక్ష్మీపురం మండలంలోని నేలమానుగూడలో అత్తవారింటికి వెళ్లివస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఇదే ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై ఉన్న మరో యువకుడు బిడ్డిక సంజీవ్ తీవ్రగాయాలతో ఆస్పత్రి పాలయ్యాడు. భామిని పీహెచ్‌సీలో ప్రాథమిక వైద్య సేవలు అందించి 108 అంబులెన్స్‌పై పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య లలిత ఫిర్యాదు మేరకు బత్తిలి ఏఎస్సై కొండగొర్రి కాంతారావు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు.

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య


ఆత్మహత్యకు పాల్పడిన శంకరరావు

జియ్యమ్మవలస రూరల్: మండలంలోని కుందరతిరువాడ గ్రామానికి చెందిన గుగ్గిలాపు శంకరరావు(26) బుధవారం ఉదయం సుమారు 3 గంటల సమయంలో విశాఖపట్నంలో రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొంత కాలం క్రితం శంకరరావు తన భార్య హేమతో కలిసి విశాఖపట్నానికి బతుకు తెరువు కోసం వెళ్లి అక్కడే ఉంటున్నాడు. అయితే శంకరరావు ఆత్మహత్యకు గల కారణాలు తెలియలేదు. మృతుడికి ఇద్దరు పిల్లలు, తండ్రి రామిశెట్టి, తల్లి సావిత్రమ్మ, అక్క, అన్నయ్య ఉన్నారు.

ఉరివేసుకుని మరో వ్యక్తి..

భోగాపురం: మండలంలోని దల్లిపేట గ్రామంలో మనస్తాపంతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై స్థానికులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన దల్లి అప్పలరెడ్డి(38)కి వివాహమై సుమారు 15 ఏళ్లు అవుతోంది. భార్య ఎర్రమ్మ, ఒక పాప ఉన్నారు. మద్యానికి బానిసైన అప్పలరెడ్డి నిత్యం మద్యం తాగుతూ ఇంటికి వచ్చేవాడు. ఈ క్రమంలో భార్య ఎర్రమ్మ మందలించడంతో మనస్తాపం చెంది సమీపంలోని ఓ లేఅవుట్‌లో బుధవారం చెట్టుకు ఉరేసుకున్నాడు. స్థానికుల సమాచారంతో భోగాపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గోరపాడు సమీపంలోనే ఏనుగులు

సీతంపేట: గడిచిన వారం రోజులుగా నాలుగు ఏనుగుల గుంపు గోరపాడు సమీపంలో తిష్టవేసింది. దీంతో గిరిజనులు భయాందోళన చెందుతున్నారు. కొండపోడు వ్యవసాయంలో పండిస్తున్న పైనాపిల్ పండ్లను ఏనుగులు తినేస్తున్నాయని వాపోతున్నారు. పోడు పనులకు సైతం అటువైపు వెళ్లడం లేదని గిరిజనులు తెలిపారు. అటవీశాఖ సిబ్బంది ఏనుగుల గమనాన్ని పరిశీలిస్తున్నారు. ఏనుగులు తిరిగే వైపు వెళ్లవద్దని గిరిజన రైతులకు సూచిస్తున్నారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని జరజాపుపేట గ్రామానికి చెందిన ఓ యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై గణేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని మరో గ్రామానికి చెందిన బాలికను ఇంటర్ చదివే సమయంలో పెళ్లి చేసుకుంటానని నమ్మించి శారీరకంగా అనుభవించి మోసం చేశాడని బాధిత బాలిక ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. ఫిర్యాదు ఆధారంగా దర్యాప్తు చేపడతామని పేర్కొన్నారు.

15 నుంచి పారిశుధ్య పక్షోత్సవాలు

• కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

పార్వతీపురంటౌన్:

పారిశుధ్యం, వ్యక్తిగత పరిశుభ్రతను ప్రోత్సహించడానికి ఈ నెల 15 నుంచి ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ కార్యక్రమాన్ని పార్వతీపురం మన్యం జిల్లావ్యాప్తంగా నిర్వహించాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జూలై 15 నుంచి 30వ తేదీ వరకు పారిశుధ్య పక్షోత్సవాలు జరుగుతాయని, ప్రజలను కూడా ఇందులో భాగస్వాములను చేయాలని కలెక్టర్ సూచించారు. వ్యర్థాలను పారవేయడం, నిర్వహణ, వ్యక్తిగత పరిసరాల పరిశుభ్రత, అవగాహన ప్రచారాలు, శుభ్రపరిచే డ్రైవ్‌లు, పారిశుధ్య మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం, వ్యక్తిగత మరుగుదొడ్లను వినియోగించుకునేలా చేయడం వంటి వివిధ అంశాలపై ప్రత్యేక దష్టి సారించాలని చెప్పారు. ఈ మేరకు కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పారిశుధ్య పక్షోత్సవాలు, స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల నిర్వహణపై సంబంధిత అధికారులతో కలెక్టర్ బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు.

ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలై 15 నుంచి 30వరకు పారిశుధ్య కార్యక్రమాలు జరుగుతాయని, ఇందుకు సంబంధించిన ముందస్తు ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని పంచాయతీ, మున్సిపల్ అధికారులను ఆదేశించారు. పెద్దఎత్తున పారిశుధ్య కార్యక్రమాలు జరగనున్నందున అందుకు తగిన విధంగా పారిశుధ్య కార్మికులను, బ్లీచింగ్, చెత్తను తరలించేందుకు అవసరమైన వాహనాలు, ఇతర సామగ్రిని పంచాయతీ తీర్మానంతో ముందుగానే సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఈ డ్రైవ్‌లో రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలని, ఇందుకు ఉపాధిహామీ ద్వారా చదును చేసుకునే అవకాశం ఉందని సూచించారు. అవసరమైన ప్రదేశాల్లో జేసీబీలను అద్దె ప్రాతిపదికన తీసుకోవాలని కమిషనర్లను ఆదేశించారు. ఈ పక్షోత్సవాల్లో మురుగు కాలువలను శుభ్రం చేయడం, బ్లీచింగ్ చల్లడం, దోమలు వ్యాప్తి చెందకుండా స్ప్రేయింగ్ చేయించడం వంటివి కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. ప్రతి గ్రామంలో గ్రామ పారిశుధ్య కమిటీ సమావేశాలను నిర్వహించి, గ్రామంలో చేపట్టవలసిన పనులపై తీర్మానం చేసుకోవాలని, అందుకు తగిన విధంగా పనులు నిర్వహించుకోవాలని స్పష్టం చేశారు.

వినియోగంలోకి చెత్త సంపద కేంద్రాలు

గ్రామాల్లో ఉండే రక్షిత మంచినీటి పథకాలను శుభ్రపరచడం, వాటికి మంచి రంగులు వేయించి, సాక్షి సంతకం తీసుకోవాలని తెలిపారు. నీటి పరీక్షలు నిర్వహించి, స్వచ్ఛమైన రక్షిత మంచినీటిని ప్రజలకు సరఫరా చేయాలన్నారు. గ్రామాల్లో ఉండే చెత్త నుంచి సంపద సేకరణ కేంద్రాలను పూర్తిగా వినియోగంలోకి తీసుకురావాలని స్పష్టం చేశారు. ప్రతి నెలా మూడవ శనివారం నిర్వహించే స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై విజయవంతం చేసేందుకు కృషిచేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి టి.కొండలరావు, మున్సిపల్ కమిషనర్లు సీహెచ్. వెంకటేశ్వర్లు, ఎస్‌జీవీ రతన్ రాజు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.ఎస్.భాస్కర రావు, ప్రోగ్రాం అధికారి డా. టి.జగన్మోహన్ రావు, డీఎల్డీఓ రమేష్ రామన్, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలంతా భాగస్వాములు కావాలి

గ్రామాల్లో అవగాహన ప్రచార కార్యక్రమాలను నిర్వహించాలని, పారిశుధ్య లోపం వల్ల కలిగే దుష్ప్రభావాలను ప్రజలకు వివరించి, కార్యక్రమంలో భాగస్వాములయ్యేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. జిల్లా మంత్రితో పారిశుధ్య కార్యక్రమాల పోస్టర్లను విడుదల చేయించాలని, పారిశుధ్య కార్మికులందరూ యాప్రాన్, మాస్క్, చేతికి గ్లౌజులు విధిగా వేసుకోవాలని చెప్పారు. జిల్లాలో మిషన్ కల్పవృక్ష కార్యక్రమం జరుగుతుందని, ఈ డ్రైవ్ లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని కూడా చేపట్టవచ్చని కలెక్టర్ హితవు పలికారు. గ్రామాల్లో నిర్మాణం పూర్తిచేసుకున్న సామాజిక మరుగుదొడ్లను ప్రారంభించుకోవాలని, వ్యక్తిగత మరుగుదొడ్ల వినియోగాన్ని ప్రజలకు వివరిస్తూ బహిరంగ మలవిసర్జనను విడనాడేలా ప్రతిజ్ఞ చేయించాలని పేర్కొన్నారు.

మత్స్యకారుల హాహాకారాలు


ప్రాజెక్టు ఒడ్డున అధికారులు

• మడ్డువలస ప్రాజెక్టులో చేపలవేటకు వెళ్లి గుర్రపుడెక్కలో చిక్కుకున్న మత్స్యకారులు
• కాపాడేందుకు రంగంలోకి దిగిన పోలీసులు, మత్స్యకారులు
• ప్రాజెక్టులో గాలింపు చర్యలు


ప్రాజెక్టులో మత్స్యకారుల గాలింపు చర్యలు

వంగర:

మడ్డువలస గొర్లె శ్రీరాములునాయుడు ప్రాజెక్టులో చేపలవేటకు వెళ్లిన ఇద్దరు మత్స్యకారులు గుర్రపుడెక్క మధ్యలో బుధవారం చిక్కుకున్నారు. వారిని బయటకు తెచ్చేందుకు పోలీసులు, మత్స్యకారులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. మెట్టమగ్గూరు గ్రామానికి చెందిన తండ్రీ కొడుకులు దాసరి రాములు, దాసరి ఆదినారాయణ బుధవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో చేపలు వేటకు వెళ్లారు. ప్రాజెక్టులో దట్టంగా ఉన్న గుర్రపుడెక్క వీరిని చుట్టుముట్టడంతో పడవ ముందుకు సాగని పరిస్థితి. తండ్రీ కొడుకులు అందులో చిక్కుకోవడంతో తమను రక్షించాలంటూ ప్రాజెక్టు లోపలి భాగం నుంచి కేకలు వేస్తూ ఆర్తనాదాలు చేశారు. విషయం తెలుసుకున్న వంగర పోలీసులు హుటాహుటిన ప్రాజెక్టు వద్దకు చేరుకున్నారు. ఎగువ ప్రాంతాల్లో ఉన్న పట్టువర్ధనం గ్రామం నుంచి కొంతమంది మత్స్యకారులు, మగ్గూరు గ్రామం నుంచి కొంతమంది మత్స్యకారులను ఆరు పడవలతో ప్రాజెక్టు లోపలకు పంపించారు. కటిక చీకటి కావడంతో గుర్రపుడెక్కను తొలగించుకుంటూ వారి వద్దకు వెళ్లేందుకు చేసిన ప్రయత్నంలో అష్టకష్టాలు పడ్డారు. బాధితుల కేకలు వినిపిస్తున్నప్పటికీ దట్టంగా అల్లుకున్న గుర్రపుడెక్క కారణంగా వారి వద్దకు చేరుకునే పరిస్థితి కానరావడం లేదు. రాత్రి వరకు శ్రమించినప్పటికీ కటిక చీకటి కావడంతో ప్రాజెక్టులో చిక్కుకున్నవారిని చేరుకునేందుకు తోటి మత్స్యకారులకు వీలు పడలేదు. అర్ధరాత్రి అయ్యేసరికి వారిని బయటకు తీసుకువస్తామంటూ బాధిత కుటుంబీకులకు పోలీసులు భరోసా ఇస్తున్నారు. మత్స్యకారులు చేస్తున్న ప్రయత్నాలు ఫలించి క్షేమంగా ఒడ్డుకు చేరుకోవాలని రాములు కుటుంబ సభ్యులు గంగమ్మతల్లిని ప్రార్థిస్తున్నారు.

వరకట్న వేధింపుల కేసులో ముగ్గురికి జైలుశిక్ష


కోర్టు తీర్పును వెల్లడిస్తున్న డీఎస్పీ గోవిందరావు

విజయనగరం క్రైమ్: నాలుగేళ్ల క్రితం విజయనగరంలోని దిశ పోలీస్ స్టేషన్‌లో నమోదైన వరకట్నవేధింపుల కేసులో ముగ్గురు ముద్దాయిలకు విజయనగరం స్పెషల్ మొబైల్ కోర్ట్ బుధవారం జైలు శిక్ష విధించినట్లు మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ గోవిందరావు తెలిపారు. 2021లో విజయనగరం మహిళా పోలీస్‌స్టేషన్‌లో నమోదైన వరకట్న వేధింపుల కేసులో ముద్దాయిలు ముగ్గురికి ఒక ఏడాది సాధారణ జైలు, రూ.51వేల జరిమానా విధిస్తూ విజయనగరం జేఎఫ్‌సీఎం (స్పెషల్ మొబైల్ కోర్టు) న్యాయమూర్తి కుమారి పి.బుజ్జి తీర్పు వెల్లడించినట్లు డీఎస్పీ ఆర్.గోవింద రావు చెప్పారు. ఈ కేసు వివరాలిలా ఉన్నాయి. జిల్లాలోని నెల్లిమర్ల మండలం చినబూరాడపేటకు చెందిన యడ్ల మహాలక్ష్మికి గజపతినగరానికి చెందిన ఎన్ని రామకృష్ణతో 2019లో వివాహం జరిగింది. పెళ్లి సమయంలో రూ.8 లక్షల కట్నం, 4 తులాల బంగారు ఆభరణాలు, రూ.50వేల సారె సామాన్లు కానుకగా కన్నవారు ఇచ్చారు. వివాహం అనంతరం భర్త ఎన్ని రామకృష్ణ, అతని తల్లిదండ్రులు చిన్నయ్య, సత్యవతిలు అదనంగా మరో రూ.2 లక్షలు కట్నంగా తీసుకురావాలని మహాలక్ష్మిని శారీరకంగా, మానసికంగా వేధించడంతో బాధితురాలు మహిళా పోలీస్‌స్టేషన్‌లో 2021లో ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు మేరకు అప్పటి మహిళా పీఎస్ ఎస్సై బి.గణేష్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేసి, నిందితులను అరెస్టు చేసి, కోర్టులో అభియోగ పత్రం దాఖలు చేశారు. కోర్టు విచారణలో భర్త ఎన్ని రామకృష్ణ (ఎ1), అత్త ఎన్ని సత్యవతి (ఎ2), మామ ఎన్ని చిన్నయ్య (ఎ3) వరకట్న వేధింపులకు పాల్పడినట్లు రుజువు కావడంతో ముద్దాయిలకు పై విధంగా శిక్ష విధిస్తూ స్పెషల్ మొబైల్ కోర్టు న్యాయమూర్తి పి.బుజ్జి తీర్పు వెల్లడించారని డీఎస్పీ వివరించారు.

ఆయిల్ బాల్స్‌తో దోమల నియంత్రణకు చర్యలు

విజయనగరం:

నగరంలో దోమల వృద్ధిని నియంత్రించేందుకు ప్రజారోగ్య సిబ్బంది ఆయిల్ బాల్స్ తయారీ ప్రక్రియను ప్రారంభించారు. ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి సూచనలతో పారిశుధ్య సిబ్బంది ఆయిల్ బాల్స్‌ను తయారు చేస్తున్నారు. దోమలు వృద్ధి కేంద్రాల నియంత్రణకు ఆయిల్ బాల్స్‌ను వినియోగిస్తారు. చెరువులు, కుంటలు, నీరు నిల్వ ఉన్న ప్రాంతాలలో ఆయిల్ బాల్స్‌తో చర్యలు చేపట్టనున్నారు. గతంలో ఈ తరహా ఆయిల్ బాల్స్‌ను నేరుగా విడిచిపెట్టడంతో అవి నీటిలో మునిగిపోయి ఆశించిన ఫలితాలు వచ్చేవి కాదు. దీంతో నూతన విధానంతో గోనె సంచుల గుడ్డలను ఆయిల్‌తో ముంచి ఐదు రోజుల పాటు నానబెట్టి ఆ తర్వాత నీటి నిల్వలలో వేసేందుకు సమాయత్తమవుతున్నారు. ఈ సందర్భంగా ప్రజారోగ్యాధికారి సాంబమూర్తి మాట్లాడుతూ డెంగీ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున అందుకు గల ప్రధాన కారణమైన దోమల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు.

దొరికిన చోరీ సొత్తు

పార్వతీపురం రూరల్: జిల్లా కేంద్రంలోని చెరువు గట్టు వీధిలో నివాసం ఉంటున్న పిల్లి రాము ఇంట్లో మంగళవారం చోరీ జరిగిన విషయం విదితమే. ఈ చోరీకి సంబంధించి ఐదు తులాల బంగారు ఆభరణాలు బుధవారం రాము ఇంటి వెనుక భాగంలో పడి ఉన్నాయి. ఈ విషయాన్ని బాధితుడు గమనించి పోలీసులకు తెలియజేశారని, ఈ మేరకు నిందితులను పట్టుకునేందుకు దర్యాప్తు కొనసాగుతోందని పట్టణ ఎస్సై గోవింద తెలిపారు.

వెబ్‌సైట్‌లో స్పీకింగ్ ఆర్డర్స్ జాబితా

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ వైద్య కళాశాల, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రుల్లో 20 కేటగిరిల్లో 91 ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇవ్వగా అందులో 12 కేటగిరిలకు సంబంధించిన పోస్టుల స్పీకింగ్ ఆర్డర్స్ జాబితాను విజయనగరం.ఏపీ, జీటీవీ.ఇన్ వెబ్‌సైట్‌లో పొందుపరిచామని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. పద్మలీల తెలిపారు. స్పీచ్ థెరపిస్టు, కంప్యూటర్ ప్రోగ్రామ్, సిస్టమ్ అడ్మినిస్ట్రేటర్, నెట్‌వర్క్ అడ్మినిస్ట్రేటర్, పీఈటీ, జూనియర్ అసిస్టెంట్ కమ్ అసిస్టెంట్, లైబ్రరీ అసిస్టెంట్, ఎలక్ట్రీషియన్ గ్రేడ్-3, ల్యాబ్ టెక్నీషియన్, ఆఫీస్ సబార్డినేట్, జనరల్ డ్యూటీ అటెండెంట్, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్, పోస్టుల జాబితా వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు తెలిపారు.

3250 రేజీల రేషన్ బియ్యం పట్టివేత


అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని పట్టుకున్న సీఐ అప్పలనాయుడు

సాలూరు: పట్టణంలో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని పట్టణ పోలీసులు బుధవారం పట్టుకున్నారు. ఈ మేరకు సీఐ అప్పలనాయుడు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని పెద బజార్‌లో గల బుద్దెపు సురేష్ దుకాణంలో అక్రమంగా నిల్వ ఉంచిన 75 బియ్యం బస్తాల్లో సుమారు 3,250 కేజీల రేషన్ బియ్యం పట్టుకున్నారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి తక్కువ ధరకు ఈ బియ్యం కొని, బయట ఎక్కువ ధరకు అమ్ముతానని నిందితుడు తెలిపినట్లు సీఐ పేర్కొన్నారు. పట్టుకున్న బియ్యాన్ని పట్టణ సివిల్‌సప్లయిస్ అధికారులకు తదుపరిచర్యల నిమిత్తం అప్పగించామని తెలిపారు.

కేజీబీవీలో అగ్నిప్రమాదంపై ఫైర్ ఆడిట్

• విద్యార్థులు ఆందోళన చెందొద్దు
• సోమవారానికి పూర్తిస్థాయిలో తరగతుల ప్రారంభం
• కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్
• కేజీబీవీని సందర్శించి దుర్ఘటనపై ఆరా


అగ్నిప్రమాదం జరిగిన తీరును పాఠశాల ఎస్‌ఓ విజయ కుమారిని అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ అంబేడ్కర్


ప్రమాదం జరిగిన తరగతి గదులను పరిశీలిస్తున్న కలెక్టర్

కొత్తవలస: మండలంలోని అడ్డూరువానిపాలెం గ్రామం సమీపంలో గల కస్తూర్బా గాంధీ పాఠశాలలో మంగళవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంపై వెంటనే ఫైర్ ఆడిట్ నిర్వహించి, సాయంత్రం లోగా నివేదికను అందజేయాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విద్యుత్, సమగ్రశిక్ష ఇంజినీర్ అధికారులు, జిల్లా ఫైర్ అధికారులను ఆదేశించారు. కేజీబీవీలోని తరగతి గదుల్లో మంగళవారం రాత్రి అగ్ని ప్రమాదం జరిగిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా పాఠశాలను కలెక్టర్ బుధవారం సందర్శించారు. కాలిపోయిన తరగతి గదులను, సామగ్రి, చుట్టుపక్కల పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులతో మాట్లాడి జరిగిన ఘటనపై ఆరా తీశారు. ఉన్న విద్యార్థులకే వసతి సౌకర్యం లేక, తరగతి గదుల్లోనే భోజనం, పడుకోవడం వంటివి చేస్తున్నట్లు గుర్తించారు. ఇలాంటి పరిస్థితుల్లో ఇంటర్ తరగతులకు అనుమతులు ఎలా ఇచ్చారని జిల్లా విద్యాశాఖ అధికారి మాణిక్యం నాయుడిని ప్రశ్నించారు. జిల్లాలోని అన్ని కేజీబీవీలకు ప్లస్ టూ అనుమతులు ఇచ్చామని ఆయన బదులిచ్చారు. దీంతో కలెక్టర్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.

యథావిధిగా మెగా పేరెంట్స్, టీచర్ సమావేశం

అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ సిబ్బంది అప్రమత్తంగా ఉండి ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పాఠశాలనుంచి వెళ్లిపోయిన విద్యార్థులను వెంటనే రప్పించి తరగతులను యథావిధిగా ప్రారంభించాలని స్పష్టం చేశారు. విద్యార్థులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, పాఠశాలలో పరిస్థితులన్నీ బాగానే ఉన్నాయని విద్యార్థులందరూ పాఠశాలకు తిరిగి రావాలని కోరారు. గురువారం జరిగే మెగా పేరెంట్, టీచర్స్ సమావేశాన్ని యథావిధిగా నిర్వహిస్తామని ప్రకటించారు.సోమవారం నాటికి పూర్తిస్థాయిలో విద్యార్థులను పాఠశాలకు రప్పించాలని అధికారులను ఆదేశించారు. పాఠశాలలోని ప్రస్తుతం పనులను సమగ్రశిక్ష ఏపీసీ డాక్టర్ రామారావు దగ్గరుండి నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో ఆర్‌డీఓ డి.కీర్తి, విద్యుత్‌శాఖ ఎస్‌ఈ లక్ష్మణరావు, డీఎంహెచ్‌ఓ జీవనరాణి, జిల్లా ఫైర్ అధికారి రామ్ కుమార్, ఎస్ఎస్ఏ ఈఈ హరిప్రసాద్, ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ స్వప్న, తహసీల్దార్ అప్పలరాజు, ఎంపీడీఓ రమణయ్య, ఎంఈఓలు శ్రీదేవి, బి.శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.

రూ.3 లక్షల విలువైన వెండి ఆభరణాలు స్వాధీనం

• సోంపేటకు చెందిన వ్యక్తి అరెస్ట్


సోంపేటకు చెందిన నిందితుడి నుంచి వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్న జీఆర్పీ సిబ్బంది

విజయనగరం క్రైమ్: స్థానిక రైల్వేస్టేషన్‌లోని ప్లాట్‌ఫాం నంబర్ 3పై ఓ వ్యక్తి నుంచి వెండి ఆభరణాలను జీఆర్పీ సిబ్బంది బుధవారం స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించి జీఆర్పీ ఎస్సై బాలాజీరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లా సోం పేటకు చెందిన ప్రవీణ్ సింగ్ ఒక బ్యాగ్‌లో సుమారు రూ.3 లక్షలు విలువ చేసే పది కేజీల వెండి ఆభరణాలను పట్టుకెళ్తున్నట్లు సమాచారం అందగా శ్రీకాకుళం నుంచి విజయనగరం వచ్చే రైలులో దిగిన ప్రవీణ్‌ను పట్టుకుని విచారణ చేయగా పొంతన లేని సమాధానాలు ఇచ్చాడు. దీంతో తమదైన శైలిలో విచారణ చేసి రవాణా చేస్తున్న ఆభరణాలకు ఎలాంటి రుసుము, ఆధారాలు లేకపోవడంతో వెంటనే అదుపులోకి తీసుకున్నామని జీఆర్పీ ఎస్సై బాలాజీరావు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.


చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹95	₹160	₹170

గంజాయి, పోక్సో కేసులపై దృష్టి పెట్టండి

• నేర సమీక్ష సమావేశంలో ఎస్పీ ఆదేశాలు


సమావేశంలో కేసుల పురోగతిని తెలుసుకుంటున్న ఎస్పీ వకుల్ జిందల్, ఏఎస్పీ సౌమ్యలత

విజయనగరం క్రైమ్: పెరుగుతున్న గంజాయి కేసుల నివారణపై దృష్టి పెట్టాలని ఎస్పీ వకుల్ జిందల్ అన్నారు. ఈ మేరకు జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో జిల్లాలోని అన్ని స్టేషన్ల హౌస్ ఆఫీసర్లు, మూడు డివిజన్ల అధికారులతో ఎస్పీ వకుల్ జిందల్ బుధవారం నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. దర్యాప్తులో ఉన్న గ్రేవ్, నాన్‌గ్రేవ్, ఎన్డీపీఎస్, పోక్సో, అట్రాసిటీ, మిస్సింగ్, రోడ్డు ప్రమాదాల కేసులను, లాంగ్ పెండింగ్ కేసులను ఈ సందర్భంగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ వకుల్ జిందల్ మాట్లాడుతూ ప్రజలకు శక్తి యాప్ గురించి అవగాహన కల్పించాలని ఇందుకు శక్తి టీమ్స్ మరింత విస్తృతంగా పని చేయాలని ఆదేశించారు. కళాశాలలు, పాఠశాలల్లో విద్యార్థినులకు సెల్ఫ్ డిఫెన్సు టెక్నిక్స్ నేర్పించేందుకు శక్తి వారియర్స్ టీమ్స్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని చెప్పారు.

ఫిర్యాదు దారులతో మర్యాదగా ప్రవర్తించాలి

మహిళలపై జరిగే అఘాయిత్యాలపై పోలీస్‌స్టేషనుకు వచ్చే ఫిర్యాదులపై వెంటనే కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించాలని, స్టేషన్‌లో ఫిర్యాదుదారులు వేచి ఉండకుండా చూడాలని సూచించారు. గంజాయి అక్రమ రవాణ నియంత్రణపై దృష్టి పెట్టాలని, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన నాలుగు చెక్ పోస్టుల వద్ద నిరంతరం వాహన తనిఖీలు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశించారు. అనంతరం పలు కేసుల్లో శాఖాపరంగా ప్రతిభ కనబర్చిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ వకుల్ జిందల్ ప్రత్యేకంగా అభినందించి, ప్రశంసా పత్రాలను ప్రదానం చేశారు. సమావేశంలో అదనపు ఎస్పీ పి. సౌమ్యలత, విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు, బొబ్బిలి డీఎస్పీ జి.భవ్యరెడ్డి, చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులు, మహిళా పిఎస్ డీఎస్పీ ఆర్.గోవిందరావు, డీటీసీ డీఎస్పీ ఎం.వీరకుమార్ ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర కీర్తిని నిలిపిన నేత

• జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించిన 'బొత్స'
• ఘనంగా బొత్స జన్మదిన వేడుకలు


బొత్స జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్


మెడికల్ క్యాంప్‌ను ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

చీపురుపల్లి:

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉత్తరాంధ్ర కీర్తిని ఇనుమడింపజేసిన ఘనత శాసనమండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణకు దక్కిందని, విశాఖపట్నం నుంచి హైదరాబాద్ వరకు ఉత్తరాంధ్ర పేరు చెబితే బొత్స గుర్తుకొచ్చే విధంగా పరిపాలన సాగించారని జిల్లా పరిషత్ చైర్మన్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎంపీ, పీఏసీ మెంబర్ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. శాసనమండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ జన్మదినోత్సవాన్ని బుధవారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో పట్టణంలోని ఓ కల్యాణ మంటపంలో వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మెగా మెడికల్ క్యాంప్‌ను ప్రారంభించిన అనంతరం కేక్ కట్ చేశారు. అనంతరం హ్యాపీ బర్త్‌డే బొత్స అంటూ కార్యకర్తలు నినాదాలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ జిల్లాను ఎంతో అభివృద్ధి పథంలో నడిపించి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే తిరుగులేని నాయకుడిగా ఎదిగిన బొత్స నాయకత్వంలో పని చేస్తున్నందుకు గర్వపడాలన్నారు.

మెడికల్ క్యాంప్‌లో 350 మందికి వైద్య పరీక్షలు

ఇదిలా ఉండగా 'బొత్స' జన్మదినం సందర్భంగా నిర్వహించిన మెగా మెడికల్ క్యాంప్ విజయవంతమైంది. శ్రీకాకుళానికి చెందిన జెమ్స్ ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది హాజరై వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన 350 మంది హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అలాగే వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు బైక్ ర్యాలీతో శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానానికి వెళ్లి పూజలు నిర్వహించారు. బాపూజీ వృద్ధాశ్రమంలో వృద్ధులకు భోజనాలు పెట్టించి, ప్రభుత్వ రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ విజయనగరం పార్లమెంటరీ పరిశీలకుడు కిల్లి సత్యనారాయణ, డీసీఎంఎస్ మాజీ చైర్మన్‌లు ఎస్‌వీ.రమణరాజు, కేవీ.సూర్యనారాయణరాజు, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షులు వలిరెడ్డి శ్రీనివాస నాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇప్పిలి అనంతం చీపురుపల్లి, గరివిడి, మెరకముడిదాం మండలాల పార్టీ అధ్యక్షులు మీసాల వరహాల నాయుడు, మీసాల విశ్వేశ్వరరావు, కోట్ల వెంకటరావు, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి దన్నాన జనార్దనరావు, నియోజకవర్గం యువజన విభాగం అధ్యక్షుడు బెల్లాన వంశీకృష్ణ, వలంటీర్ విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు బెల్లాన త్రినాథరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.